

నాడంతా కులాసా..


నేడేదీ భరోసా..?

- ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ పేరిట ఆర్భాటం
- అధికారంలోకి వచ్చి వంద రోజులైనా నేటికీ ఊసే లేని వైనం
- నమ్మి ఓట్లేసిన ప్రజలకు పంగనామమేనా..?
- పథకాల అమలుపై ఆశలు సన్నగిల్లుతున్న వైనం

నెల్లూరు సిటీ / నెల్లూరు (వీఆర్సీ సెంటర్) / నెల్లూరు (బారకాసు)/ / నెల్లూరు (అర్బన్) / నెల్లూరు(టౌన్): 'సూపర్ సిక్స్'.. ఎన్నికలకు ముందు దీని పేరిట టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ఆర్భాటం అంతా.. ఇంతా కాదు. నాకు ఓటేయండి.. మీకు ఉజ్వల భవిత చూపుతా.. జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలకు రెండింతలు ఇస్తానంటూ ఆయన చేసిన హడావుడిని ఎవరూ మరిచిపోయి ఉండరు. ఈయన మాటలను విశ్వసించిన ప్రజలు పట్టం కట్టారు. ఈ తరుణంలో అధికారంలోకి వచ్చి 100 రోజులవుతున్నా, హామీల అమలుకు సంబంధించిన విధివిధానాలను నేటికీ ఖరారు చేయలేదు. మరోవైపు హామీల అమల్లో భయమేస్తోందంటూ ఇటీవల కొత్త రాగమెత్తారు. ఈ తరుణంలో సంక్షేమ పథకాలను అమలు చేస్తారనే ఆశ ప్రజల్లో క్రమంగా సన్నగిల్లుతోంది.

మాటపై నిలిచిన జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాసంకల్ప యాత్ర పేరిట పాదయాత్ర చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ప్రజలతో మమేకమయ్యారు. వీరి సమస్యలను దగ్గర్నుంచి చూసిన ఆయన వాటి పరిష్కారమే లక్ష్యంగా 2019 ఎన్నికలకు ముందు నవరత్నాల పేరిట మేనిఫెస్టోకు రూపకల్పన చేశారు. ఆ ఎన్నికల్లో అఖండ విజయం సాధించి సీఎంగా బాధ్యతలు చేపట్టాక వీటిని సమగ్రంగా అమలు చేసి ప్రజల మోముల్లో చిరునవ్వును నింపారు. అమ్మఒడి, రైతు భరోసా, చేయూత, ఆసరా, విద్యాదీవెన, వసతి దీవెన పథకాలను సమర్థంగా అమలు చేసి ప్రజల నమ్మకాన్ని చూరగొన్నారు. అయితే తాజాగా అధికారం చేపట్టిన చంద్రబాబు తన పాత పంథానే ప్రస్తుతం అవలంబిస్తూ ప్రజలను మోసం చేసే పనిలో ఉన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండి ఉంటే తమకు ఈ కష్టాలు ఉండేవి కావనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



నెల్లూరు రూరల్‌లో ఇదీ తీరు..



ప్రతి మహిళకూ..
రూ.1500
అర్హులు: 1.05 లక్షలు
వెచ్చించాల్సిన మొత్తం (నెలకు) : రూ.15.75 కోట్లు

నిరుద్యోగ భృతి
అర్హులు: 36 వేలు
నెలకు ఇవ్వాల్సిన మొత్తం: రూ.10.80 కోట్లు

తల్లికి వందనం
అర్హులు: 55 వేలు
వెచ్చించాల్సిన మొత్తం (ఏడాదికి): రూ.82.50 కోట్లు

అన్నదాత సుఖీభవ
అర్హులు: 18,664
వెచ్చించాల్సిన మొత్తం (ఏడాదికి) : రూ.37.32 కోట్లు



నెల్లూరు సిటీలో ఇలా..



ప్రతి మహిళకూ
రూ.1500
అర్హులు : 90 వేలు
వెచ్చించాల్సిన మొత్తం (నెలకు) : రూ.13.50 కోట్లు

నిరుద్యోగ భృతి
అర్హులు: 30,790 వేలు
నెలకు ఇవ్వాల్సిన మొత్తం: రూ.9.23 కోట్లు

తల్లికి వందనం
అర్హులు: 65 వేలు
వెచ్చించాల్సిన మొత్తం (ఏడాదికి) : రూ.97.50 కోట్లు

రైతులకు అండగా నిలవాలి



గత ప్రభుత్వంలో రైతు భరోసా నిధులు బ్యాంక్ ఖాతాల్లో సకాలంలో జమయ్యేవి. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఈ నిధులను అందజేసేలా చొరవ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
– దొడ్ల మస్తాన్‌యాదవ్, ములుమూడి

హామీని నిలబెట్టుకోవాలి



ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చారు. దీన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సిలిండర్లు ఉచితంగా వస్తాయని మేమెంతో ఆశగా ఎదురుచూస్తున్నాం.
– సానా సుబ్బమ్మ, సత్యనారాయణపురం

తల్లికి వందనం ఏమైంది సారూ..!



అమ్మఒడి పథకం స్థానంలో తల్లికి వందనాన్ని ఇస్తామంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఈ పథకం ద్వారా ఒక ఇంట్లో ఎంత మంది చదువుకునే పిల్లలుంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని చెప్పారు. నా ముగ్గురు పిల్లలు చదువుకుంటున్నారు. తల్లికి వందనం ద్వారా రూ.45 వేలను ఇవ్వాల్సి ఉన్నా, నేటికీ అందజేయలేదు.
– లావణ్య, నెల్లూరు

గతంలో ఠంచన్‌గా అందేది



గత ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పథకం ద్వారా రూ.15 వేలను ఠంచన్‌గా అందించేవారు. తాము అధికారంలోకి వస్తే ఎంత మంది పిల్లలుంటే అందరికీ ఈ మొత్తాన్ని ఇస్తామని చంద్రబాబు ప్రకటించారు. నా ఇద్దరు పిల్లలకు రూ.15 వేల చొప్పున, రూ.30 వేలు రావాల్సి ఉంది. పాఠశాలలను పునః ప్రారంభించి మూడు నెలలవుతున్నా, నేటికీ అందజేయలేదు. పిల్లలకు ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాన్ని కొనుగోలు చేయడం కష్టంగా ఉంది. – స్రవంతి, నెల్లూరు

నిరుద్యోగ భృతేదీ..?



ఇంటికో ఉద్యోగం.. అలా కాని పక్షంలో నిరుద్యోగ భృతిగా రూ.మూడు వేలను ఇస్తామని గత ఎన్నికల సమయంలో ఎన్డీఏ కూటమి హామీ ఇచ్చింది. అయితే దీనికి సంబంధించిన విధివిధానాలను నేటికీ ఖరారు చేయలేదు. గతంలో మాదిరిగా ఈసారి కొర్రీలు పెడతారేమోననే భయం కలుగుతోంది.
– మహేష్‌బాబు, నెల్లూరు

గతంలో సజావుగా అందాయి



గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా నిధులు సమయానికి అందేవి. అయితే నూతన ప్రభుత్వం ఏర్పడి వంద రోజులవుతున్నా, అన్నదాత సుఖీభవ నిధులను జమ చేయలేదు. దీంతో సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు.
– మస్తాన్, సౌత్‌మోపూరు

ఇప్పటి వరకు దేన్నీ అమలు చేయలేదు



ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం చంద్రబాబు పలు హామీలిచ్చారు. అధికారంలోకి వచ్చాక వీటిని అమలు చేసే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడంలేదు. సిలిండర్లను ఎప్పుడు ఇస్తారానని నిరీక్షిస్తున్నాం.
– లక్ష్మీదేవి, స్టోన్‌హౌస్‌పేట

రూ.1500 మొత్తాన్ని ఇస్తామన్నారు.. ఏదీ..?



ప్రతి మహిళకూ రూ.1500 చొప్పున ఇస్తామని చంద్రబాబు ఆర్భాటపు ప్రకటనలు చేశారు. అధికారంలోకి వచ్చి 100 రోజులవుతున్నా, ఆ దిశగా ఎలాంటి కసరత్తు చేయడంలేదు. మూడు నెలలకు గానూ రూ.4500ను ఇవ్వాల్సి ఉంది. దీన్ని త్వరగా అమలు చేసి అందజేయాలి.
– అరుణ, నెల్లూరు

తల్లికి వందనాన్ని ఎప్పుడిస్తారు..?



నా కుమారుడు దర్గామిట్టలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. గతంలో ఏటా జూన్‌లోనే రూ.15 వేలను అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చేవారు. దీని ద్వారా పిల్లలను సంతోషంగా చదివించేవాళ్లం. ఎంత మంది పిల్లలుంటే అందరికీ రూ.15 వేల చొప్పున ఇస్తామని గత ఎన్నికల్లో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ ఏడాదికి లేదని.. వచ్చే సంవత్సరంలో ఇస్తామని మంత్రి లోకేశ్ చెప్తున్నారు. పిల్లలను చదివించడం మాలాంటి వారికి ఇబ్బందిగా మారనుంది. ఎంతమంది పిల్లలుంటే అందరికీ ఈ విద్యాసంవత్సరం నుంచే రూ.15 వేలను ఇవ్వాలి.
– గౌసియా, డైకస్‌రోడ్డు

విద్యా, వసతిదీవెన ఎక్కడా..?



విద్యార్థుల సౌలభ్యం కోసం విద్యాదీవెన, వసతిదీవెన ద్వారా నగదును గత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సకాలంలో అందజేసేవారు. దీన్ని అమలు చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చినా నేటికీ పట్టించుకోవడంలేదు. ఫీజులను ప్రభుత్వం చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ముక్కుపిండి మా నుంచి వసూలు చేస్తున్నాయి.
– వినయ్, బీటెక్, ద్వితీయ సంవత్సరం, నెల్లూరు

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతం

నెల్లూరు(బృందావనం): సంతపేటలోని వ్యాసరాజ మఠం ప్రాంగణంలో గల రమా సత్యనారాయణ స్వామి మందిరంలో సత్యనారాయణ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. మందిర ప్రధానార్చకుడు ప్రేమకృష్ణాచార్, టీటీడీ వేదపండితుడు వేదగిరి ఫణిశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉభయకర్తలుగా శ్రీనివాసరావు, శ్రీచరిత దంపతులు వ్యవహరించారు. మందిర గౌరవ కార్యనిర్వాహకులు సుబ్బారావు, సుజాత దంపతులు, మందిర మేనేజర్ సుధారవీంద్రబాబు దంపతులు పాల్గొన్నారు.

- వేదాయపాళెంలోని కృష్ణ మందిరంలో సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. పూజలను దేవస్థాన ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఉభయకర్తలుగా విజయకుమార్‌రెడ్డి, వాణిమల్లీశ్వరి దంపతులు వ్యవహరించారు. ధర్మకర్త వెంకటేశ్వర్లు, మందిర కమిటీ ఉపాధ్యక్షుడు వేణుబాబు, ప్రధాన కార్యదర్శి సుబ్బరామరాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ముఖ్యం

నెల్లూరు(క్రైమ్): చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు సూచించారు. గుడ్.. బ్యాడ్ టచ్, మహిళల రక్షణ చట్టాలు తదితరాలపై నగరంలోని కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.

21న స్వచ్ఛ సాగర్

నెల్లూరు(బారకాసు): ప్రపంచ తీర పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకొని సముద్ర తీర ప్రాంతాల్లో స్వచ్ఛ సాగర్ – సురక్షిత సాగర్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ఈ నెల 21న ఇన్‌కాయిస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని సమితి రాష్ట్ర కోశాధికారి కొండూరు లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. సమితి జిల్లా అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి వికాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు, బాబు, లక్ష్మణరావు, రవి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

నెల్లూరు (టౌన్): విజయవాడ వరద బాధితుల సహాయార్థం అవెన్యూస్ స్కూల్ యాజమాన్యం రూ.లక్ష విరాళాన్ని ప్రకటించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కును నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి కరస్పాండెంట్ కృష్ణచైతన్య, చైర్మన్ బాబునాయుడు అందజేశారు.

స్వచ్ఛత హీ సేవలో భాగస్వాములు కావాలి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగరంలోని జెడ్పీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలను జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ బుధవారం నాటారు. సీఈఓ కన్నమనాయుడు, డిప్యూటీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మిత, డ్వామా పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

నెల్లూరు(బారకాసు): నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ సూచించారు. ట్రాఫిక్ నిర్వహణపై కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ రోశయ్య, సౌత్, నార్త్ ట్రాఫిక్ సీఐలు వెంకటేశ్వర్లు, రామకృష్ణ పాల్గొన్నారు.

- స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా 20వ డివిజన్లోని కావేరినగర్, హనుమాన్ జంక్షన్, 13వ డివిజన్లో గల జగదీష్‌నగర్ మున్సిపల్ పార్కు ప్రాంగణంలో మొక్కలను నాటారు. కమిషనర్ సూర్యతేజ, కార్పొరేటర్ మహేష్‌బాబు, టీడీపీ నేత భువనేశ్వరిప్రసాద్, అధికారులు సంపత్‌కుమార్, సంజయ్, చైతన్య, ప్రదీప్‌కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాకాణి, ఆదాల నియామకంపై హర్షం

నెల్లూరు (లీగల్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తదితరులను నియమించడంపై పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, కోర్ కమిటీ మాజీ సభ్యుడు కుడుమల రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రకటనను బుధవారం విడుదల చేశారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

నెల్లూరు(క్రైమ్): కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలో వాహన తనిఖీలను ట్రాఫిక్ ఆర్ఎస్సై చంద్రమౌళి బుధవారం చేపట్టారు. మద్యం మత్తులో వాహనాలను నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు.

దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ యత్నం

నెల్లూరు(బారకాసు): దేశ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రాజేశ్వరి, రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, ప్రవీణ్‌కుమార్, శీనయ్య, అశోక్‌నాయుడు, రవి, సురేష్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో తనిఖీలు

నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జీజీహెచ్)లో పలు వార్డులు, ఓపీ రూమ్‌లను ఆస్పత్రి సూపరింటెండెంట్ సిద్ధానాయక్ ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేటివ్ అధికారి కళారాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ నరేంద్ర పాల్గొన్నారు.

వేదగిరిలో విశేషాభిషేకాలు

నెల్లూరు సిటీ: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉత్సవమూర్తులకు అభిషేకం, గరుడసేవ, గిరిప్రదక్షిణను బుధవారం నిర్వహించారు. ఉభయకర్తలుగా సుంకర రాజేంద్ర, రాధాకృష్ణయ్య వ్యవహరించారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ

నెల్లూరు సిటీ: ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాల్లో మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడేందుకు ముందుకు రావాలని ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలను బుధవారం నాటారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని వవ్వేరు పీఏసీఎస్ కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీఓ గురప్ప, వవ్వేరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుబ్రహ్మణ్యం, సబ్ డివిజనల్ సహకారాధికారి సుభాషిణి, సీఈఓ శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాళెం పీఏసీఎస్ సీఈఓ సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

- కలువాయి మండలంలోని నాలుగు నూతన సంఘబంధ మహిళా సహకార సంఘ సభ్యులకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు, రిజిస్టర్లను డీసీఓ అందజేశారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు (సెంట్రల్): మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు.

విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరాలు

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల కోసం ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి చిన్నపిల్లల స్పెషలిస్ట్ ఉదయ్‌కీర్తి, సీనియర్ డెంటల్ కన్సల్టెంట్ కిరణ్మయిరెడ్డి పేర్కొన్నారు. సంతపేటలోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. దాదాపు వంద మందిని పరీక్షించి మందులను అందజేశారు. ప్రిన్సిపల్ సురేష్, డీన్ గణేష్, ప్రైమరీ ఇన్‌చార్జి వైష్ణవి, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి అరుణ పాల్గొన్నారు.

80 శాతం పనులు పూర్తి

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని 31వ డివిజన్ అక్కచెరువుపాడులో గురుకుల పాఠశాల పనులు 80 శాతం మేర పూర్తయ్యాయని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. గురుకుల పాఠశాలను టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డితో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు.

దంపతులపై దాడి

నెల్లూరు(క్రైమ్): దంపతులపై యువకుడు దాడికి పాల్పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. చంద్రమౌళీనగర్‌లో నాగేంద్ర కుటుంబం నివాసం ఉంటోంది. ఈ క్రమంలో ఆ ప్రాంతంలో కుక్కలను నగరపాలక సంస్థ సిబ్బంది బుధవారం పట్టుకెళ్లారు. దీంతో అక్కడున్న ఓ యువకుడు నీవే ఫిర్యాదు చేశావంటూ వారితో గొడవపడి దాడి చేశారు. ఘటనపై వేదాయపాళెం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశారు.

మహీంద్ర థార్ రాక్స్ విడుదల

నెల్లూరు (టౌన్): నగరంలోని బాలాజీ ఏజెన్సీస్ ఇండస్ట్రీస్‌లో మహీంద్ర కంపెనీకి చెందిన థార్ రాక్స్ మోస్ట్ ప్రిస్టేజియస్ వాహనాన్ని షోరూమ్ సీఈఓ నరేంద్రనాథ్, మేనేజింగ్ పార్టనర్ శ్రీనివాసరావు చేతుల మీదుగా బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ వేరియెంట్లలో వాహనం లభిస్తుందని చెప్పారు. వాహన ధర రూ.12.99 లక్షల నుంచి 18.99 లక్షల వరకు ఉందని తెలిపారు. ఫైనాన్షియర్ సంజయ్, సేల్స్ మేనేజర్లు మధు, జయరాజ్, అనంతశివ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): పనికెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. హరనాథపురంలోని సర్వేపల్లి కాలువకట్టకు చెందిన రాము, లక్ష్మి దంపతులు. సిమెంట్ గోదాముల్లో కూలీగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయన మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో ఈ నెల 11న పనికెళ్లిన ఆయన జాడ తెలియరాలేదు. ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. గాలింపు చర్యలు చేపట్టినా ప్రయోజనం లేకపోవడంతో బాలాజీనగర్ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగరాజు దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని చేనేత, జౌళి శాఖ కార్యాలయంలో మొక్కలు నాటుదాం – పర్యావరణాన్ని కాపాడదాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి, బాదం, కానుగ మొక్కలను నాటారు. చేనేత, జౌళి శాఖ సంచాలకుడు వరప్రసాద్, వీవర్స్ ఫెడరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు కడిమి వెంకటశేషయ్య, అఖిల భారత పద్మశాలి సంఘ కేంద్ర కమిటీ సభ్యుడు రామనాథం రాజశేఖర్, పద్మశాలి సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చింతలపూడి పెంచలయ్య, కార్యాలయ సిబ్బంది ప్రసాద్‌రావు, రజని, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన

నెల్లూరు(బారకాసు): భూటాన్‌లో ఇటీవల నిర్వహించిన ఆట్యా – పాట్యా పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించిన స్టోన్‌హౌస్‌పేటలోని బీవీఎస్ మున్సిపల్ కార్పొరేషన్ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థి తుమ్మల పూజితను కమిషనర్ సూర్యతేజ బుధవారం సత్కరించారు. కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పీఈటీ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీడీసీఎల్ సీఎండీ రాక నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు జిల్లాకు గురువారం రానున్నారు. విద్యుత్ సంస్థల ఇంటర్ సర్కిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీలను ఆయన ప్రారంభించనున్నారు.

రంగడి దేవస్థానంలో పూజలు నేడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామికి చిత్రకూటోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నామని, భక్తులు తరలిరావాలని కోరారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(బారకాసు): ఐటీఐలో చేరాలనుకునే విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్లో ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని ఆరెస్సార్ ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ రెహమాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం మూడులోపు వెరిఫికేషన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. రిజిస్టర్ చేసుకున్న అభ్యర్థులకు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ట్రేడ్ల కౌన్సెలింగ్‌ను తమ కళాశాలలో ఈ నెల 30న నిర్వహించనున్నామని, వివరాలకు 97039 67967 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.